## ఎమ్మెల్యే వివేకానంద్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలు



ఎమ్మెల్యేకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మాన ప్రతిని అందజేస్తున్న కుత్బుల్లాపూర్ టూ వీలర్స్ అసోసియేషన్ సభ్యులు

జీడిమెట్ల, నవంబర్ 2: కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి , ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు మద్దతుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని షాపూర్‌నగర్ , కొంపల్లి మున్సిపాలిటీ, కేవీబీం టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్, సుచిత్ర టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ , సూరారం టూ వీలర్స్ అసోసియేషన్, రాయల్ టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ , కుత్బుల్లాపూర్ టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేస్తూ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ నాయకులు షాదుల్లా, ప్రేమ్, షేక్ ఫరీద్, పరమేశ్, ఎండీ ఖాదీర్, ఆర్. పాండురంగారావుతో పాటు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు మద్దతుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఆర్య కటిక సంఘం సభ్యులు మద్దుతు తెలుపుతూ గురువారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరె కటిక సంఘం నాయకులు బంతిలాల్, మోహన్, మనోజ్, సుభాశ్, మోహన్ లాల్, పండరి, విజయ్, అశోక్, రాము తదితరులు పాల్గొన్నారు.



రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలో ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠా జయసింహల సమక్షంలో బీజేపీ నగర మహంకాళి జిల్లా కార్యదర్శి గోపీ, రాంనగర్ డివిజన్ గిరిజన మోర్చా అధ్యక్షుడు లోక్యనాయక్‌తో పాటు 100 మందికి పైగా బాగ్‌లింగంపల్లికి చెందిన యువకులు, మహిళలు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వెంకట కృష్ణ, జనార్దన్, తెలంగాణ హౌస్‌ఫెడ్ డైరెక్టర్ కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

–చిక్కడపల్లి



గురువారం వెంగళరావునగర్ డివిజన్‌లోని యాదగిరినగర్ లో 50 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

–వెంగళరావునగర్, నవంబర్ 2



అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన భరత్‌నగర్ బస్తీకి చెందిన 200 మంది బీజేపీ మహిళా నేతలు

–అంబర్‌పేట, నవంబర్ 2

# రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

### మంత్రి సబితా ఇంద్రారెడ్డి



మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మహేశ్వరం నాయకులు

మహేశ్వరం, నవంబర్ 2: బీఆర్ఎస్‌లోకి రోజురోజుకు వలసలు కొనసాగుతున్నాయని, ప్రజలు బీఆర్ఎస్‌కు అండగా నిలుస్తున్నారని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం, గంగారం, చిన్న తూప్ర గ్రామాలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజక వర్గం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న తనను మరో సారి గెలిపించాలని కోరారు. ఇప్పటి వరకు జరుగుతున్న పనులు కొనసాగాలంటే బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని ఆమె తెలిపారు. మహేశ్వరంలో చేస్తున్న అభివృద్ధి పనులకు ప్రతి పక్ష పార్టీలకు నిద్ర పట్టడం లేదన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న 93 లక్షల మందికి బీమా సౌకర్యాన్ని త్వరలోనే అందించనున్నామని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలకు తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తున్నదని చెప్పారు. తెలంగాణలో సంక్షేమ రాజ్యం కావాలంటే.. మరో సారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంగోతు రాజునాయక్, బీసీ సెల్ నియోజక వర్గం అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, జిల్లా రైతు సమన్వయ సమితి నాయకులు కూన యాదయ్య, సీనియర్ నాయకులు కరోళ్ల చంద్రయ్య ముదిరాజ్, మీనాజ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దు

### కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి



ర్యాలీలో మాట్లాడుతున్న కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్ రూరల్, నవంబర్ 2: కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని, అభివృద్ధికే పట్టం కట్టాలని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లాలోని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారంలో భాగంగా వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి, ప్రజలను మోసం చేయడానికి కాంగ్రెస్ నాయకులు వస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. దేశంలో ఎవరూ ఊహించిన విధంగా రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అన్ని విధాల అభివృద్ధి చేసి, రాష్ట్రాన్ని ఆదర్శంగా మార్చారని తెలిపారు. పదేండ్లలో మేడ్చల్ నియోజకవర్గం అనూహ్య అభివృద్ధి సాధించిందని, అభివృద్ధిలో మున్సిపాలిటీలు శరవేగంగా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ నగరంలోని బంజారాహిల్స్‌లా మారిందన్నారు. పేద ప్రజలను ఆదుకున్న సీఎం కేసీఆర్‌ను మూడో సారి ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించి, మళ్లీ సేవ చేసుకునే భాగ్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ లక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నందారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మిత్రకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలి

### కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం



అభ్యర్థి మిత్రకృష్ణను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం

జియాగూడ, నవంబర్ 2: కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కోరారు. గురువారం జియాగూడ ఎస్‌డీఏ గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు అంజియాదవ్ నేతృత్వంలో జరిగిన గొల్ల, కురుమ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా అభ్యర్థి మిత్రకృష్ణ, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, కురుమ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడు తుమ్‌కుంట అరుణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం మాట్లాడుతూ జియాగూడలో గొల్లకురుమల ఓట్లు పెద్ద సంఖ్యలో ఉన్నాయని, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. కాగా, వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం జియాగూడ అధ్యక్షుడు మంతటి నర్సింహ, బీఆర్ఎస్ యూత్ నాయకులు అభిషేక్‌మిత్ర తదితరులు పాల్గొన్నారు.

## 'సికింద్రాబాద్'ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం

### సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, నవంబర్ 2: సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. గురువారం సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో ఉన్న అడ్డగుట్ట డివిజన్‌లో ఎన్నికల ప్రచార పాదయాత్రను ప్రారంభించారు. ముందుగా అడ్డగుట్ట జీఎం అంజయ్య విగ్రహం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పాదయాత్రను ప్రారంభించారు. అడ్డగుట్ట ప్రజలు పద్మారావుకు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. గులాబీ పూల వర్షం కురిపించారు. మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పద్మారావుగౌడ్ తనయులు కిశోర్‌గౌడ్, కిరణ్‌గౌడ్, రామేశ్వర్‌గౌడ్, త్రినేత్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అడ్డగుట్టలో పద్మారావుగౌడ్‌కు మంగళ హారతి ఇస్తున్న మహిళలు